క్లుప్తంగా

అభాగ్యునికి ఆశ్రయం



రామారావును ఆశ్రమంలో చేర్పిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాన ప్రస్థాశ్రమంలో మందస మండలం గౌడగురంటి గ్రామానికి చెందిన గోకర్ల రామారావుకు ఆశ్రయమిచ్చారు. హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసిన ఈయన ప్రమాదానికి గురై దిక్కుతోచని స్థితిలో స్వగ్రామానికి చేరాడు. స్థానికంగా ఆదరణ లేక పోవడంతో సోంపేట పట్టణంలో సోమపోలమాంబ అమ్మవారి గుడి ప్రాంగణంలో కొన్నాళ్లుగా ఉండేవాడు. ఇతని దీన స్థితిని స్థానికులు సీతయ్య ఫౌండేషన్‌కు తెలియజేయగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుల్ల రమేష్, మోహన్‌లు శనివారం వానప్రస్థాశ్రమంలో చేర్పించారు.

ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సూరిబాబు



సంతబొమ్మాళి: ఇటీవల విజయవాడలో జరిగిన ఏపీసీపీఎస్ ఈఏ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రెడ్డి సూరిబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సతీష్, సీఎం దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ పాత పింఛన్ విధానం పునరుద్ధరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

యోగా గురువులకు సత్కారం



యోగా గురువులను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

సోంపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా గురువులు ఉట్ల మీనకేతనరావు, దివాకర్, బుంగ సత్యం, కె.ఢిల్లీరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వి.కృష్ణారావు, కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వానరానికి దహన సంస్కారం



చనిపోయిన వానరానికి పూజలు చేస్తున్న బలరాంపేట యువత

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని బలరాంపేట వీధిలో ఒక వానరానికి స్థానిక యువత సంప్రదాయబద్ధంగా దహన సంస్కారాలు నిర్వహించారు. బలరాంపేటలో మూడురోజుల కిందట వానరానికి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో ఆ వీధికి చెందిన యువకులు కోతికి చికిత్స అందించారు. ఆ వానరం శనివారం మృతి చెందింది. దీంతో వానరం కళేబరానికి హిందూ సంప్రదాయం ప్రకారం పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి.. శ్రీరామ నామం జపిస్తూ శ్మశాన వాటికకు తీసుకెళ్లిన దహన సంస్కారాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: మండలం భవానీపురంలో శనివారం ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులు, ఆశా కార్యకర్తలతో కలిసి ర్యాలీ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బర్రి నరసమ్మ పాల్గొన్నారు.

ఘనంగా విజయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న స్వామివారు

సోంపేట: సోంపేట పట్టణంలోని రామసాగర్ సమీపంలో నిర్మించిన విజయాంజనేయస్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సోంపేట, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాగునీరు ప్రశ్నార్థకం

- మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం
- 1200 ఎకరాలకు సాగునీరు అందక రైతుల పాట్లు



నిరుపయోగంగా ఈదుపురం ఎత్తిపోతల పథకం

ఇచ్ఛాపురం రూరల్ : సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం మండలం కొఠారీ, పూర్ణాటకం, పత్రిపుట్టుగ, ధర్మపురం గ్రామాలతో పాటు కవిటి మండలం భైరిపురం, వింధ్యగిరి, రాజపురం, లండారిపుట్టుగ గ్రామ పరిధిలో సుమారు 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఏకైక ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. ఈదుపురం బాహుదానది చెంతన ఉన్న ఈ పథకాన్ని 2004 ఫిబ్రవరిలో 'జై కిసాన్ ఎత్తిపోతల పథకం' పేరిట నిర్మించారు. ఆయా ప్రాంతాల్లో రబీ, ఖరీఫ్ సీజన్‌లలో సంబంధిత రైతులు పంటలు పండించుకునేవారు. 2009లో కురిసిన వర్షాలకు బాహుదా నదికి వరద పోటెత్తడంతో ఎత్తిపోతల పథకం నీట మునిగి పరికరాలు పాడయ్యాయి. దీంతో పథకం మూలకు చేరింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొంత మేర నిధులు మంజూరు చేయడంతో మరో ఐదేళ్ల వరకు రైతులకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. 2016లో కొఠారీ ఉమ్మడి చెరువు వద్ద పైపులైన్ పూర్తిగా ధ్వంసం కావడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకుండాపోయింది. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు మరోసారి ఎత్తిపోతల పథకం యంత్రాలు 15 రోజుల పాటు నీటిలో ఉండిపోవడంతో పరికరాలతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫారం పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండేళ్లగా వర్షాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో పంటలు పండించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ హయాంలో రైతులకు నష్టం వాటిల్లిందో... మళ్లీ అదే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాలకులు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధించి తమకు సాగునీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



పాడైన యంత్రాలు



ఎండిపోయిన కొఠారీ పంట పొలాలు

ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలి



ఈదుపురం ఎత్తిపోతల పథకం ద్వారా ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లోని పంట పొలాలకు సాగునీరు అందేది. తిత్లీ తుఫాన్‌కు యంత్రాలు పూర్తిగా పాడైపోయాయి. అయితే అప్పటి పాలకులకు పలుమార్లు విన్నవించినా ఫలితం కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి పథకాన్ని పునరుద్ధించాలి.

– కొచ్చెర్ల యాదవరెడ్డి, రైతు, కొఠారీ

రైతులకు విత్తనాల పంపిణీ



నగరంపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న పలు పార్టీల నాయకులు



దండుగోపాలపురంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు ,అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి, చినవంక గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద శనివారం పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి, పలు పార్టీల సీనియర్ నాయకులు బమ్మిడి మోహన్‌రావు, దువ్వాడ జయరాం చౌదరి చేతుల మీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం రైతుభరోసా కేంద్రం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెట్లతాండ్ర సర్పంచ్ పంగ అసిరినాయుడు, ఆరంగి వసంతరావు, గున్న దండాసి, బి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమంలా 'నేను బడికి పోతా'



పెద్దశ్రీరాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కంచిలి: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని ఎంఈఓ–1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. పెద్దశ్రీరాంపురంలో శనివారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు విధిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఎం మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జె.జిల్లుండ పాఠశాలలో హెచ్‌ఎం కోటేశ్వరి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ ఎ.జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కబీర్‌దాస్ జయంతి



కబీర్‌దాస్ వేషధారణలో విద్యార్థులు

కంచిలి: ప్రముఖ హిందీ కవి, రాజస్థానీ, భోజ్‌పురీ, పంజాబీ అవధి భాషలలో గ్రంథాలు రాసిన కబీర్‌దాస్ జయంతి వేడుకలు శనివారం బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్ఈ కోర్సును ప్రారంభించే దిశలో పదో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలో మొదటి కవితా పాఠానికి సంబంధించి కబీర్‌దాస్ పాఠాన్ని వేషధారణతో విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుని దేవస్నానం



ఇచ్ఛాపురం: జేష్టమండపంలో స్వామివారి చందనోత్సవం



కంచిలి: జగన్నాథుని నేత్రోత్సవ వేడుక

ఇచ్ఛాపురం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం జగన్నాథ స్వామి చందనోత్సవ కార్యక్రమం ఇచ్ఛాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జేష్టపౌర్ణమి పురస్కరించుకుని పూరీ సంప్రదాయాన్ని అనుసరించి మూలవిరాట్‌కు దేవస్నానం చేశారు. నూతన వస్త్రాలతో అలంకరించి జేష్ట మండపానికి తీసుకొచ్చి సుగంధద్రవ్యాలు, చందనంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవతల ముఖాలను మూసివేసి 15 రోజుల పాటు చీకటి గదిలో ఉంచుతారు. ఈ కార్యక్రమాన్ని స్థానికంగా స్వామివారిని ఉక్కలోవేయడంగా పేర్కొంటారు. ఈ 15 రోజులు వాతావరణంలో పెనుమార్పులు ఏర్పడి ప్రజలు సైతం ఉక్కపోతకు గురవుతుంటారని నమ్మకం. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బి.రామారావు, వార్డు కౌన్సిలర్ బచ్చ జగన్నాథం, అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు, రామకృష్ణాచార్యులు పాల్గొన్నారు.

- కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని జగన్నాథ స్వామి ఆలయంలో జగన్నాథుని నేత్రోత్సవ వేడుక శనివారం కన్నులపండుగలా జరిగింది. దేవతా మూర్తులను ఆలయం వెలుపలకు తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ జానకిరాందాస్, భక్తులు పాల్గొన్నారు.
- కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పురాతన జగన్నాథ మందిరం వద్ద శనివారం జేష్ట పౌర్ణమి సందర్భంగా జగన్నాథస్వామి దేవస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం ఆవరణలో ఉన్న జగన్నాథ మందిరం వద్ద జై జగన్నాథ సంఘం ఆధ్వర్యంలో దేవస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



కాశీబుగ్గ: తర్లాకోటలో దేవస్నానం వేడుకల్లో భక్తులు



కాశీబుగ్గ: పలాస జగన్నాథ మందిరం వద్ద జేష్ట పౌర్ణమి వేడుకలు

వీసీలు, ప్రొఫెసర్లపై దాడులు హేయం



బమ్మిడి సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్లు, ప్రొఫెసర్లపై టీడీపీ నేతలు దాడులకు తెగబడటం, దూషించడం హేయమైన చర్యలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు కనీసం మౌలిక వసతులకు నిధులు కేటాయించలేదని, ఖాళీ పోస్టులు భర్తీ చేయలేదని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వర్సిటీల రూపురేఖలు మారాయని, 3,295 పోస్టుల భర్తీకి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. .

రైతులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న ఏపీఎం గొడబ ప్రసాదరావు

కాశీబుగ్గ: మందస మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీవోఏ ఈ నెలాఖరుకల్లా 15 ఎఫ్‌పీజీ సంఘాలను ఏర్పాటు చెయ్యాలన్నారు. దీని ద్వారా కిసాన్ రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు, స్త్రీ నిధి మేనేజర్ సాయిరాం, శ్రీనివాస్, అధ్యక్షులు కాంతమ్మ, కోశాధికారి విజయశ్రీ సీసీలు, వీఓఏలు, కళ్యాణి పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీలు కిటకిట



టెక్కలిలో గ్యాస్ ఏజెన్సీ కేంద్రం వద్ద జనం

టెక్కలి: పట్టణంలో పలు గ్యాస్ ఏజెన్సీ కేంద్రాలకు గ్యాస్ వినియోగదారులు క్యూ కడుతున్నారు. అధికారంలోకి రాగానే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈకేవైసీ నమోదు చేస్తున్నారంటూ గ్రామాల్లో ప్రచారం జరగడంతో వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ కేంద్రాలకు తరలివస్తున్నారు. అయితే వినియోగదారులకు సాధారణ రెన్యువల్ ప్రక్రియలో భాగంగా ఈకేవైసీ నమోదు చేస్తున్నాం తప్ప ఉచిత సిలిండర్ల కోసం తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

కాశీబుగ్గ: మందస మండల పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 తరగతులకు ఎస్సీ విద్యార్థులు, 6, 7 తరగతులకు ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు ఈ నెల 26లోగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

సంతబొమ్మాళి: రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అన్నారు. శనివారం మర్రిపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడానని చెప్పారు. వంశధార కాలువపై షట్టర్లను ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన హెచ్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శనివారం ప్రోత్సాహకాలను అందించింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో 100కు 95 మార్కులు దాటి వచ్చిన 11 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటోలను ట్రస్ట్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మాదుగుల రామారావు, సెక్రటరీ మాదుగుల శ్రీనివాసరావు, పాత్రికేయుడు అబ్దుల్, ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, తెలుగు ఉపాధ్యాయిని దండా ఉమామహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల బియ్యంలో అక్రమాలకు పాల్పడితే కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ: పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించి అమ్మకాలు జరిపే వారిపై, రేషన్ డీలర్లపై తక్షణమే కేసులు నమోదు చేయాలని పలాస ఆర్డీఓ భరత్ నాయక్ ఆదేశించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం మండలాల సీఎస్‌డీటీలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతో శనివారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్టాక్‌లో తేడాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీలు సేనాపతి రవికుమార్, వాయిలాపల్లి గిరిరాజు, కంచరాన శ్రావణ్‌కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'మిరాజ్' చిత్ర నిర్మాణం



శివసాగర్ తీరంలో సన్నివేశాలను చిత్రీకరిస్తున్న బృందం

వజ్రపుకొత్తూరు రూరల్: కేఎంసీ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న మిరాజ్ సినిమా నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఉద్దాన, తీర ప్రాంతంలోని మెట్టూరు, తోటూరు, అక్కుపల్లి శివసాగర్ తీరాలలో శనివారం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. సముద్రంలో కొట్టుకువచ్చిన ఓ మూట ఇద్దరు అమాయకులకు దొరకడంతో వారి జీవితం ఆసక్తికరంగా పలు మలుపులు తిరుగుతూ సాగే ఇతివృత్తంతో ఈ చిత్రం రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ విష్ణుదేవ్ తెలిపారు. నటీ నటులుగా చరణ్, డాక్టర్ కుమార్ నాయక్, రమేష్ యాదవ్, చైల్డ్ ఆర్టిస్టు కార్తీక్, తారా, అసిస్టెంట్ డైరెక్టర్ శరత్, డీఓపీ ఎండీబీ ఖలీల్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న అప్పారావు

కాశీబుగ్గ: మాదకద్రవ్యాలు(డ్రగ్స్) వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని పలాస ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎం.ఆర్.వి.అప్పారావు అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.వి.గిరిబాబు, హెచ్‌ఎం చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు మండల సర్వసభ్య సమావేశం

పలాస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పలాస ఎంపీడీఓ మెట్ట వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

టెక్కలి రూరల్: స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లో పట్టు మహాదేవి కోనేరు గట్టుపై అలివేలుమంగ, గోదాదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. టెక్కలి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వరాహ నర్సింహచారీ ఆధ్వర్యంలో శనివారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సోంపేట: వరి పంటకు వచ్చే తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి చక్కటి మార్గమని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. జీవ శిలీంద్ర నాశిని సుడోమోనస్‌తో విత్తన శుద్ధి చేసే విధానంపై శనివారం లక్కవరం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జీవిత తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు



రామయ్యపేటలో టీకాలు వేస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు, రామయ్యపేట, భావాజీపేట, ఎరకయ్యపేట, చౌదరికొత్తూరు గ్రామాల్లో శనివారం కురుడు పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 431 పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేశారు. ప్రస్తుత వర్షాల సీజన్‌లో పశువులు వ్యాధుల బారిన పడకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక జ్వరం, మేత తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే పశు వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేవీఓ వెంకటరత్నం, నారాయణరావు, వీఏ ముకుందరావు, వెటర్నరీ సహాయకులు కోట ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు



అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు

ఇచ్ఛాపురం రూరల్: నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. శనివారం పాయితారి గ్రామంలో రైతులతో కలిసి నవధాన్యాల తయారీ, దుక్కుల్లో వేసే విధానం, వాటివల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాలను దుక్కుల్లో వేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు కందాల కుమారి, జాడు తులసయ్య పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధిపై చర్చ

ఇచ్ఛాపురం: పట్టణంలోని వల్లభరాయగెడ్డ శ్మశాన వాటిక అభివృద్ధిపై రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. స్వేచ్ఛావతినగర్‌లోని రోటరీ ఫంక్షన్‌హాల్లో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో రొటేరియన్ త్రినాథ్‌రెడ్డి, పైడిశెట్టి దినేష్, వేదవ్యాస్, రోహిత్, పాక తులసీదాస్, ఎస్.ప్రదీప్, ఎస్‌ఎన్ పండా, జయదేవ్, బచ్చు జగన్నాథం, ఎం.సూర్యం, రావి జయకృష్ణ, బి.లక్ష్మణయ్య, రంగాల శ్రీను, రామారావు, గోపీచౌదరి, అమీర్‌ఆలీ, వి.సురేష్, నవీన్‌కుమార్, షణ్ముఖ, ఎల్.సి.రావు పాల్గొన్నారు.